ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 286 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 25 జనవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# సింగరేణిపై విషపురాతలు..
# ఎవరి కోసం?

**ఎవరికి లబ్ధి చేకూర్చడానికో ప్రజలకు తెలియాలన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు వెల్లడి**

**రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ప్రకటన**




**హైదరాబాద్, జనవరి 25 (ప్రభాత ఉదయం)**

సింగరేణి ఆస్తులను కొంతమందికి కట్టబెట్టే ప్లాన్ తో, కార్మికుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా విషపు రాతలు రాస్తున్నారంటూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషపు రాతల వల్ల రాష్ట్రానికి, సింగరేణికి నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఈరోజు ఉదయం ప్రజాభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. సింగరేణిపై అసత్య ప్రచారాల వెనక కుట్ర దాగి ఉందని, సింగరేణి ఆస్తులు కాజేసే ప్లాన్ ఉందని ఆరోపించారు.

టెండర్లపై అపోహలు సృష్టించేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎవరి ప్రయోజనాల కోసం తప్పుడు రాతలు రాస్తున్నారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రాబందుల నుంచి సింగరేణి ఆస్తులను కాపాడతానని ఆయన చెప్పారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వ్యవహారంపై బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ రాయడాన్ని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణ జరిపిస్తానని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిపై కిషన్ రెడ్డి పరిశీలిస్తేనే నిజాలు బయటపడతాయని చెప్పారు.

**2018లోనే సైట్ విజిట్ నిబంధన..**

కోల్ ఇండియా టెండర్ డాక్యుమెంట్ ను కేంద్ర ప్రభుత్వం 2018లో తయారు చేసిందని, అప్పుడే సైట్ విజిట్ తప్పనిసరి అనే నిబంధన పెట్టిందని భట్టి విక్రమార్క చెప్పారు. 2021లో కేంద్ర గనుల శాఖ కూడా సైట్ విజిట్ తప్పనిసరి అని చెప్పిందన్నారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందని ఆయన గుర్తుచేశారు. గత డాక్యుమెంట్లలోని నిబంధనల ఆధారంగానే ఇటీవల సింగరేణి టెండర్లు పిలిచిందని చెప్పారు. అయితే, మేమే ఈ నిబంధన పెట్టినట్లు పత్రికలు, నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో కూడా ఇష్టానుసారం ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.



## టీ హబ్‌ను స్టార్టప్ కేంద్రంగానే
# కొనసాగించాలని

**సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

**ప్రభుత్వ ఆఫీసులను తరలిస్తున్నారన్న వార్తలపై స్పందించిన రేవంత్ రెడ్డి**

**అమెరికా పర్యటన నుంచే సీఎస్‌కు ఫోన్ చేసి సూచనలు**

**టీ హబ్‌లో ఇతర కార్యాలయాలు వద్దని స్పష్టం చేసిన సీఎం**

**హైదరాబాద్, జనవరి 25 (ప్రభాత ఉదయం)**

టీ హబ్‌ను ఒక ప్రత్యేక స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలని, అందులోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న కొన్ని ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లుగా వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు.

ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. టీ హబ్‌ను స్టార్టప్‌ల కోసం ఒక ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. దాని స్వరూపాన్ని మార్చేలా ఇతర కార్యాలయాలను ఏర్పాటు చేసే ఆలోచనలుంటే వెంటనే విరమించుకోవాలని ఆదేశించారు.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలను, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు. ఏ పరిస్థితుల్లోనూ టీ హబ్ ప్రాధాన్యతను తగ్గించవద్దని ఆయన స్పష్టం చేశారు.

## ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను
# ఎందుకు రద్దు చేశారు?

**భట్టికి హరీశ్ రావు కౌంటర్**

**సింగరేణి బొగ్గు గనుల టెండర్ల విషయంలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ మధ్య డైలాగ్ వార్**



**హైదరాబాద్, జనవరి 25 (ప్రభాత ఉదయం)**

బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా 'బీటింగ్ అరౌండ్ ద బుష్' లా ఏదో చెప్పి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మసిబూసి మారేడు కాయ చేశారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది నిజం. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్ మెన్ గా పాత్ర పోషించింది నిజం అన్నారు. మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క చేసిన ..మిగతా 2లో

# వాహన రిజిస్ట్రేషన్‌లో నేటి నుంచి కొత్త విధానం



**వాహనం కొనుగోలు చేసిన షోరూమ్‌లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి**

**ఆర్టీఓ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఇకపై ఉండదు**

**ద్విచక్ర వాహనాలు, కార్లకు మాత్రమే ఈ కొత్త విధానం వర్తింపు**

**రవాణా వాహనాల రిజిస్ట్రేషన్‌లు పాత పద్ధతిలోనే కొనసాగింపు**

**హైదరాబాద్, జనవరి 25 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో వాహన కొనుగోలుదారులకు ఆర్టీఓ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తప్పనున్నాయి. వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఇకపై వాహనం కొనుగోలు చేసిన డీలర్ పాయింట్ వద్దే శాశ్వత రిజిస్ట్రేషన్ పూర్తిచేసే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. ఈ విధానం ద్వారా సమయం ఆదా అవడంతో పాటు వాహనదారులకు వేగంగా సేవలు అందనున్నాయి. వాహనదారులకు సౌలభ్యం కల్పించే ఉద్దేశంతో ఈ నెల 8న రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీనికి ..మిగతా 2లో

## నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో
# భారీ అగ్నిప్రమాదం

**సెల్లార్లో చిక్కుకున్న ఐదుగురు!**

**పొగతీవ్రతతో సహాయక చర్యలకు ఆటంకం**



**హైదరాబాద్, జనవరి 25 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఓ ఫర్నిచర్ దుకాణంలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. క్షణాల్లో భవనమంతా మంటలు వ్యాపించడంతో బయటకు రాలేక ఐదుగురు లోపలే చిక్కుకున్నారు. దట్టమైన ..మిగతా 2లో



## అహ్మదాబాద్ విమాన ప్రమాదం..
## ఎయిరిండియాకు రూ.1,100కోట్ల
# బీమా సొమ్ము!

**న్యూఢిల్లీ, జనవరి 25 (ప్రభాత ఉదయం)**

అహ్మదాబాద్‌లో గతేడాది చోటుచేసుకున్న దిగ్భ్రాంతికర విమాన ప్రమాద ఘటనలో విమానయాన సంస్థ ఎయిరిండియాకు పలు బీమా కంపెనీలు, రీఇన్సూరర్ల నుంచి పరిహారం అందింది. ఎయిర్‌లైన్‌కు రూ.1,100 కోట్లకు పైగా చెల్లించినట్లు ఇన్సూరెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. గతేడాది జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలింది. అది ఒక మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడింది. ఈ ఘటనలో విమానం తునాతునకలైంది. అది పూర్తిగా ధ్వంసం కావడంతో బీమా కంపెనీలు, రీఇన్సూరర్లు 125 మిలియన్ డాలర్లు (రూ.1,100 కోట్లకుపైగా) బీమా మొత్తాన్ని చెల్లించాయి. అలాగే ప్రమాదంలో మరణించిన మృతుల ..మిగతా 2లో



# కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్‌కు సిద్ధమా?

**కేంద్రమంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్, జనవరి 25 (ప్రభాత ఉదయం)**

కేటీఆర్, హరీశ్‌రావు సహా అందరినీ సాక్షులుగా పిలిస్తే... అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటన్నారు. సిట్ విచారణను ..మిగతా 2లో

# కాశ్మీర్‌లో మంచు దుప్పటి



జమ్మూకశ్మీర్‌లో భారీ హిమపాతం కురుస్తోంది. రెండ్రోజుల నుంచి విపరీతంగా మంచు కురుస్తుండటంతో పలు ప్రాంతాలు శ్వేతవర్ణంలోకి మారిపోయాయి. గందేర్బల్, రాజౌరీలోని ప్రాంతాలు, మాతా వైష్ణో దేవి ఆలయంపై దట్టమైన మంచు కప్పేసింది. కొన్ని ప్రాంతాల్లో మంచు అడుగుల మేర పేరుకుపోవడంతో యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా పలు రోడ్లను మూసేశారు. కీలక ప్రాంతాల్లో రైల్వే సేవలను రద్దు చేశారు.

- శ్రీనగర్,జనవరి 24 (ప్రభాత ఉదయం)

# కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్‌కు సిద్ధమా?



మొదటి పేజీ తరువాయి...

ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేసినట్లేనని.. ఇప్పటికైనా సిట్‌కు స్వేచ్ఛ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుందన్నారు. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ నా ఛాలెంజ్ కు సిద్ధమా? అని సవాల్ విసిరారు. దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతోపాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నెంబర్లను చేర్చింది నిజం కాదా? అన్నారు. ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా?అని నిలదీశారు. హైదరాబాద్ నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో బండి సంజయ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయి**

సింగరేణి సంస్థను కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గతంలో కేసీఆర్ కుటుంబమే దోచుకుంటే...కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారన్నారని విమర్శించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే... బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని ఉప ముఖ్యమంత్రి భట్టి చెబుతున్నారని...సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

2014 నుంచి ఇప్పటి వరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని తెలిపారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే... గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని.. ఆ సంస్థలో దోచుకున్న సొమ్ముతోనే బీఆర్ఎస్ పార్టీని ఇన్నాళ్లు నడిపించారని పేర్కొన్నారు. రూ.42వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుని సింగరేణిని అప్పుల పాల్జేసిందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు.. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మంతా దారి మళ్లించడం పరిపాటైందన్నారు. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలేనని...మా భాగోతం మీరు బయటపెడితే... మీ భాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

# నాంపల్లి ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం





మొదటి పేజీ తరువాయి...

పొగలు వ్యాపించటంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. ప్రమాదంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. నాంపల్లి స్టేషన్‌రోడ్‌లోని హిందీ ప్రచార్‌సభ భవనం పక్కన సాయి విశ్వాస్ ఛాంబర్స్ ఐదంతస్తుల భవనంలో బచ్చాస్ ఫర్నిచర్ దుకాణం ఉంది. శుక్రవారం రాత్రి కంటైనర్‌లో చైనా నుంచి భారీగా ఫర్నిచర్ వచ్చింది. దాన్ని రెండు సెల్లార్లలో భద్రపరిచారు. దుకాణంలో సుమారు 22 మంది పనిచేస్తున్నారు. అక్కడ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న యాదయ్య, లక్ష్మి దంపతులు.. తమ ఇద్దరు పిల్లలు ప్రణీత్(11), అఖిల్(7)లతో కలసి సెల్లార్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం పిల్లలిద్దరూ పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయారు. పిల్లల్ని సెల్లార్‌లోనే ఆడుకోవాలని చెప్పి తల్లిదండ్రులు పనిమీద బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భవనంలోని రెండు సెల్లార్లలో అగ్నిప్రమాదం సంభవించింది. పొగలు రావడం గమనించి సిబ్బంది బయటకు పరుగులు తీశారు. దుకాణంలో పనిచేస్తున్న సుభాన్‌పుర నివాసి మహ్మద్ ఇంతియాజ్(27), శాస్త్రిపురం ప్రాంతానికి చెందిన సయ్యద్ హబీబ్(40)లు.. సెల్లార్లో చిక్కుకున్న ప్రణీత్, అఖిల్, బీబీ(55) అనే వృద్ధురాలిని బయటకు తీసుకువచ్చేందుకు లోపలికి వెళ్లి.. తిరిగి రాలేదు. సెల్లార్‌లో మొత్తం ఆరుగురు ఉన్నారని అక్కడ పనిచేసే సిబ్బంది చెబుతున్నారు. మధ్యాహ్నం 1.15 గంటలకు యజమాని సతీష్ అగ్నిమాపకకేంద్రం, పోలీసు అధికారులకు సమాచారమిచ్చారు. 1.30 గంటలకు అగ్నిమాపకశాఖ సిబ్బంది రంగంలోకి దిగి.. దాదాపు గంటన్నర పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. భవనంలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు రెండు రోబో ఫైటర్లను పంపారు. పొగ దట్టంగా వ్యాపించడంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. భవనం లోపల, పైభాగంలో ఎవరూ చిక్కుకోలేదని నిర్ధారించారు. సెల్లార్‌లోకి వెళ్లేందుకు అక్కడ నిల్వచేసిన ఫర్నిచర్ అడ్డంకిగా మారింది. నగర సీపీ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సమాచారం అందగానే అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, పోలీసు సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నట్లు సీపీ వివరించారు. మంటలు అదుపులోకి వచ్చినా పొగ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సహాయక బృందాలు లోపలకు వెళ్లలేకపోతున్నాయని చెప్పారు. భవనం లోపల నలుగురు చిక్కుకున్నట్లు భావిస్తున్నామన్నారు. ఇది పెద్ద ప్రమాదమని, అతికష్టం మీద మంటలను అదుపులోకి తెచ్చామని అగ్నిమాపకశాఖ డీజీ విక్రమ్‌సింగ్‌మాన్ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లలో ఫర్నిచర్ నిల్వ చేశారన్నారు.

**వేగంగా చర్యలు చేపట్టాలి: పొంగులేటి**

ఫర్నిచర్ దుకాణంలో సంభవించిన అగ్ని ప్రమాదంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని విపత్తుల నిర్వహణశాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్‌ను రెవెన్యూ, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులను వెంటనే ఆదుకోవాలన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. పోలీస్, అగ్నిమాపక అధికారుల సమన్వయంతో సహాయక చర్యలు వేగంగా చేపట్టాలని ఆదేశించారు.



## వాహన రిజిస్ట్రేషన్‌లో నేటి నుంచి కొత్త విధానం

మొదటి పేజీ తరువాయి...

అనుగుణంగా రవాణా శాఖ అధికారులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మాదాపూర్ శ్రీకృష్ణ ఆటోమోటివ్స్ షోరూమ్‌లో ఈ కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో సంయుక్త రవాణా కమిషనర్ (జేటీసీ) మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ స్వయంగా వాహనదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు.

**కొత్త విధానంలో రిజిస్ట్రేషన్ ఇలా..**

నూతన విధానం ప్రకారం, వాహనం కొనుగోలు చేసిన తర్వాత డీలరే రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తారు. ఇన్వాయిస్, ఫారం-21, ఫారం-22, ఇన్సూరెన్స్, అడ్రస్ ప్రూఫ్, వాహన ఫొటోలు వంటి అవసరమైన పత్రాలన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. రవాణా శాఖ అధికారి ఆ దరఖాస్తును ఆన్‌లైన్‌లోనే పరిశీలించి, వెంటనే రిజిస్ట్రేషన్ నంబరు కేటాయిస్తారు. ఉదయం వాహనం కొంటే సాయంత్రంలోగా, సాయంత్రం కొంటే మరుసటి రోజు ఉదయంలోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) నేరుగా స్పీడ్ పోస్టు ద్వారా వాహన యజమాని చిరునామాకు చేరుతుంది.

**వీటికి మాత్రమే వర్తింపు..**

అయితే, ఈ కొత్త విధానం కేవలం ప్రైవేట్ వాహనాలైన బైక్‌లు, కార్లకు మాత్రమే వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. వాణిజ్య (ట్రాన్స్‌పోర్ట్) వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ యథావిధిగా ఆర్టీఓ కార్యాలయాల్లోనే కొనసాగుతుంది. ఈ విధానం అమలులో పారదర్శకత కోసం అవసరమైతే డీలర్ల షోరూమ్‌లలో తనిఖీలు నిర్వహిస్తామని రవాణా శాఖ తెలిపింది. ఈ నూతన విధానంపై రాష్ట్రంలోని 33 జిల్లాల అధికారులకు రవాణా శాఖ కమిషనర్ ఆన్‌లైన్ సమావేశం ద్వారా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.

## ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను ఎందుకు రద్దు చేశారు?

మొదటి పేజీ తరువాయి...

వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. 'భట్టి విక్రమార్కను నేను సూటిగా అడుగుతున్నా.. ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారు? నిన్న నేను బయటపెట్టిన మరో కుంభకోణం.. సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా నేటి ప్రెస్ మీట్ లో మాట్లాడలేదు? నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు?' అని ప్రశ్నించారు. సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బీఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేయడం వల్ల నిజాలు అబద్ధాలు అయిపోవు, జరిగిన స్కాంలు, స్కీంలుగా మారిపోవని హరీశ్ రావు అన్నారు. సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు? అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేసినట్లు? అని నిలదీశారు. ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేశామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు అన్నారు. సైట్ విజిట్ అమలయ్యింది, నైనీ రద్దు జరిగింది అంటే.. స్కాం జరిగినట్లే కదా? అని ప్రశ్నించారు. 'భట్టి విక్రమార్క గారు.. మీరంటే నాకు చాలా గౌరవం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జీ లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాశాను. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తాను అని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్ధం' అన్నారు.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. ఎయిరిండియాకు రూ.1,100కోట్ల బీమా సొమ్ము!

మొదటి పేజీ తరువాయి...

బంధువులకు 25 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించే ప్రక్రియ మొదలైనట్లు ఆ సంస్థలు పేర్కొన్నాయి. అయితే ఆ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని, ఆ మొత్తం పెరిగే అవకాశం ఉందని వెల్లడించాయి.

కాగా.. ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకే ఒక్క వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. విమానం హాస్టల్‌పై పడటంతో మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. వీరి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేలా టాటా గ్రూప్ ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. క్షతగాత్రుల వైద్య ఖర్చులు, మెడికల్ కాలేజీ పునరుద్ధరణ, సమీపంలో విమాన శకలాల కారణంగా దెబ్బతిన్న వాటిని పునరుద్ధరించడం కోసం ఆ ట్రస్ట్ నిధులను వినియోగిస్తున్నారు.

## మేడారం జాతరకు తరలుతున్న జనం

**ములుగు జనవరి 25 (ప్రభాత ఉదయం)**

ములుగు జిల్లా మేడారం జాతరకు ప్రజలు తరలి వెళుతున్నారు. గద్దెలను దర్శించుకుని, అమ్మవారికి బంగారం సమర్పించుకోవడం ఆనవాయితీ. గిరిజన జాతర అయినప్పటికీ కులమతాలకు అతీతంగా అంతా ఇక్కడి రావడం ఆనవాయితీ. తెలంగాణ జతారలో కొన్ని మాత్రమే ప్రముఖంగా కనిపిస్తాయి. సమ్మక్క సారక్క జాతర అనేది ములుగు జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన మేడారంలో జరిగే ఒక గిరిజన జాతర. ఈ జాతర తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందింది. వివిధ రాష్ట్రాల నుంచి పది కోట్ల మందికి పైగా హాజరవుతారని అంచనా. ములుగు జిల్లా కేంద్రం నుండి 44 కిలోమీటర్ల దూరంలో తాడ్వాయి మండలంలో ఉన్న మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో దట్టమైన అడవులు, కొండ కోనల మధ్య ఈ చారిత్రాత్మకమైన జాతర ఈనెల 28-31 తేదీల మధ్య జరుగుతుంది. సమస్త గిరిజనుల సమారాధ్య దేవతలు, కష్టాలు కడతేర్చే కలియుగ దైవాలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపద్బాంధవులుగా, కేవలం తెలంగాణలోనే గాక అఖిల భారతదేశంలోనే వనదేవతలుగా



పూజలందుకుంటున్నారీ సమ్మక్క-సారక్క . ఈ జాతర గిరిజన సాంప్రదాయ రీతుల్లో జరుగుతుంది. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుండి కూడా లక్షల కొద్దీ తండోపతండాలుగా తరలి వస్తారు. కోడి పందేలు, జూదం, పేకాట, అస్లీల నత్యాలు హోరెత్తించే పందెం రాయుళ్లకు, బెట్టింగ్ బంగార్రాజులకు, అల్టా కల్చర్ కు భిన్నంగా తెలంగాణ సంస్కతి వైభవాన్ని చాటి చెప్పే విధంగా జాతరలు జరుగుతున్నాయి. బోనాలు కావచ్చు, బతుకమ్మ కావచ్చు ఇదే ఓవలోకి వస్తాయి.

## మున్సిపల్‌పై ఎగిరేది బీజేపీ జెండాయే

**బీజేపీ పార్టీ ఇంచార్జి ఓ శ్రీనివాస్ రెడ్డి**

**గద్వాల ప్రతినిధి, జనవరి24 (ప్రభాత ఉదయం)**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గద్వాల మున్సిపల్ పై ఎగిరేది బీజేపీ జెండాయేనని బీజేపీ పార్టీ ఇంచార్జి ఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శనివారం గద్వాలలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, గద్వాల పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కార్యకర్తలు కష్టపడి పని చేయాలని, ప్రజలకు చేరువగా ఉండి వారి సమస్యలను తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.రైల్వే,రోడ్డు,డ్రైనేజీ,త్రాగునీరు సౌకర్యాల తదితర పనులు కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారానే కొనసాగుతున్నాయన్నారు. ప్రతి మున్సిపల్ వార్డులో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని అన్నారు. జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణలో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు స్థానిక సంస్థల ఎన్నికల నుంచే బీజేపీ పార్టీని బలోపేతం చేయాలని అన్నారు.గెలుపు అవకాశాలు,ఇతర అన్ని అంశాలు పరిగణలోకి తీసుకొని స్క్రూటిని కమిటీ ద్వారా



అభ్యర్థుల ఎంపిక పార్టీ చేస్తుందని అన్నారు.. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చేందుకు స్థానిక ఎన్నికల కీలకమని అన్నారు. బీజేపీ అభ్యర్థులను మంచి మెజారిటీ తో గెలిపించి..గద్వాల మున్సిపాలిటీ పై బీజేపీ జెండా ఎగురవేయాలని, అదే లక్ష్యంతో పని చేయాలని నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.గెలుపు కోసం ఎలా పని చేయాలి, ఏవిధంగా ఎన్నికలకు సమాయత్తం కావాలని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, రాష్ట్ర కౌన్సిల్ మేంబర్లు బండల వెంకట రాములు, అక్కల రమాదేవి, గద్వాల పోటీ చేసిన అభ్యర్థి బలిగేరా శివారెడ్డి, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ధరూర్ కిష్టన్న, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ పోలీస్ అకాడమీలో జాతీయ పతాక హైమాస్ట్

**రాజేంద్రనగర్ (బండ్లగూడ) , జనవరి 24 (ప్రభాత ఉదయం)**



ఆర్.బి.వి.ఆర్.ఆర్. తెలంగాణ పోలీస్ అకాడమీ లో శనివారం అకాడమీ ప్రాంగణంలోని చారిత్రకమైన డా. హ్యాంకిన్స్ మ్యూసియం టెర్రస్పై, అకాడమీ అత్యున్నత స్థలంలో ఏర్పాటు చేసిన జాతీయ పతాక హై మాస్ట్ కు హాజరైన అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ నకు అకాడమీ పోలీస్ బృందం "గార్డ్ ఆఫ్ ఆనర్" సమర్పించారు, తదుపరి జాతీయ పతాక హై మాస్ట్ ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అకాడమీ డైరెక్టర్ మాట్లాడుతూ... ఈ జాతీయ పతాక హై మాస్ట్ అకాడమీలో జరిగిన ఒక నిర్మాణాత్మక అభివృద్ధి మాత్రమే కాకుండా, దేశం పట్ల, భారత రాజ్యాంగం పట్ల , ప్రజాసేవ పట్ల తెలంగాణ పోలీస్ అచంచల నిబద్ధతకు శాశ్వత ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. అకాడమీ ప్రాంగణంలో ఎగురుతున్న జాతీయ పతాకం ప్రతి అధికారి, శిక్షణార్థి , సిబ్బందికి నైతికత, క్రమశిక్షణ, ధైర్యం, త్యాగభావం మరియు స్వార్థరహిత సేవ వంటి విలువలను నిరంతరం గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. అకాడమీ అత్యున్నత స్థలంలో స్థాపించబడిన ఈ జాతీయ పతాకం, ఉన్నత ఆశయాలు, వృత్తిపరమైన ప్రమాణాలు , తెలంగాణ పోలీస్ వ్యవస్థలో ఉత్తమ సేవాభావాన్ని పెంపొందించాలనే లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుందని డైరెక్టర్ అన్నారు. పిప్పింగ్ సెరిమనీ" అవార్డులుఈ సందర్భంగా అత్యుత్తమ సేవలు అందించిన అధికారులను సత్కరించే "పిప్పింగ్ సెరిమనీ" ను నిర్వహించారు. ఇందులో అతి-ఉత్కృష్ట సేవ పతకం 2025 ను డి. చంద్రశేఖర్ రావు, సబ్-ఇన్స్పెక్టర్ (ఐటీ & కమ్యూనికేషన్స్) మరియు ఎస్. నాగయ్య, హెచ్సి 445కి ప్రదానం చేశారు. అలాగే ఉత్తమ సేవ పతకం - 2025 ను జి. ప్రకాష్, రిటైర్డ్ సబ్-ఇన్స్పెక్టర్ కు అందజేశారు. అవార్డు గ్రహీతలను అభినందిస్తూ, వారి సేవలు పోలీస్ శిక్షణార్థులకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయని, ప్రజల పట్ల సానుభూతితో కూడిన పోలీసింగ్ , చట్టపాలన పట్ల నిబద్ధతకు ఇవి ఉత్తమ ఉదాహరణలని పేర్కొన్నారు.

**తెలంగాణ పోలీస్ అకాడమీకి పలు ప్రతిష్ఠాత్మక సర్టిఫికేషన్లు**

ఆర్.బి.వి.ఆర్.ఆర్. తెలంగాణ పోలీస్ అకాడమీ శనివారం మరో ముఖ్యమైన మైలురాయిని సాధించింది. అకాడమీ నాణ్యత, ఉత్తమత సాధనకు నిదర్శనంగా పలు ప్రతిష్ఠాత్మక సర్టిఫికేషలనుసర్టిఫికెట్లను తెలంగాణ చాప్టర్ మేనేజర్ శివయ్య అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ కు అందజేశారు. పోలీసు, అభియోగ విభాగాలు , క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలోని ఇతర భాగస్వాములకు నాణ్యమైన శిక్షణ అందిస్తున్నందుకు xూా 9001:2015, శక్తి పొదుపు చర్యల అమలుకు xూా 50001:2018,

**మెస్సులు , క్యాఫెటీరియాలలో ఆహార భద్రత ప్రమాణాల నిర్వహణకు xూా 22000:2018,**

పర్యావరణ పరిరక్షణకు xూా 14001:2015 సర్టిఫికేషన్లు లభించాయి. బి పి ఆర్ డి, ఎన్సిఆర్బి, ఇండక్షన్ , ఇన్-సర్వీస్ పోలీస్ అధికారుల శిక్షణలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గుర్తింపుగా 5-స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికేట్ ను అకాడమీకి ప్రదానం చేశారు. ఈ గుర్తింపులు ప్రక్రియలలో పారదర్శకత, ఫలితాలలో బాధ్యత మరియు పరిపాలనలో నైతికత అనే అకాడమీ విలువలను ప్రతిబింబిస్తున్నాయని డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ విజయాలకు కారణమైన అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది , శిక్షణార్థులను డైరెక్టర్ అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని మరింత గౌరవప్రదంగా నిలిపిన డైరెక్టర్కు, కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన అకాడమీ అకాడమీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది మరియు శిక్షణార్థులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు డి ఎస్ పి ఆదూరి శ్రీనివాస రావు తెలిపారు. ఈ కార్యక్రమములో డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్, చేతన ఐపిఎస్, డి. మురళీధర్ ఐపిఎస్, ఎన్. వెంకటేశ్వర్లు, కె ఆర్ కె ప్రసాద్, మధుకర్ స్వామి, అసిస్టెంట్ డైరెక్టర్స్ జి వెంకట రావు, పి సి వి రమణ వి శ్రీనివాస రావు, అకాడమీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. రమాదేవి, డాక్టర్ కె ధనజ, ఏ ఓ యాదమ్మ, అకాడమీ ఇండోర్, ఔట్డోర్ డి ఎస్ పి లు సతీష్ కుమార్, పి. జి రెడ్డి, అమృత రెడ్డి, ఆదూరి శ్రీనివాస రావు, వి భాస్కర్, సి హెచ్ దేవా రెడ్డి, టి శ్రీనివాస రావు, కృష్ణ, ఏ తిరుపతి, జగదీశ్వర రావు, అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.




ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి ని కలిసి వినతి పత్రం అందచేస్తున్న వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు పోతురాజు యాదయ్య

## అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలి

**బుద్వేల్, జనవరి 24 (ప్రభాత ఉదయం)**

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అర్హత గల ఉద్యోగులందరికి పదోన్నతులు ఇవ్వాలని వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు పోతురాజు యాదయ్య కోరారు. ఇదే విషయమై శనివారం వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి ని కలిసి వినతి పత్రం అం దజేశారు. వర్సిటీ లో వివిధ పరిశోధన స్థానాలలో పనిచేస్తున్న 58 మంది టైం స్కేల్ సిబ్బందికి రావాల్సిన గ్రాట్యూటీ ఇప్పించాలన్నారు. వర్సిటీ కి ఉన్నతాధికారులతో పాటు అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల కోసం ప్రభుత్వం నుంచి మంజూరు తీసుకువచ్చిన వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. తమ వినతి ని పరిశీలించిన వైస్ చాన్సలర్ సానుకూలంగా స్పందించారని పోతురాజు యాదయ్య తెలిపారు. వైస్ చాన్సలర్ ను కలసిన వారిలో ఉద్యోగ సంఘాల నాయకులు ఆర్ దీపారాణి, సీహెచ్ అనిల్ రెడ్డి, ఎస్ విజయ్ కుమార్ లు ఉన్నారు.



## శ్రీఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న సామాజికవేత్త

గద్వాల జిల్లా ప్రతినిధి,జనవరి 24 (ప్రభాత ఉదయం) ధరూర్ మండలం పెద్ద చింతరేవులలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ప్రముఖ సామాజికవేత్త చుక్క సుదర్శన్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీకాంత్ జోషి తీర్థప్రసాదం అందజేసి, శాలువాతో సత్కరించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ వెంకటయ్య

## అటవీశాఖ భూములను ఎట్టి పరిస్థితులలో కబ్జా కానివ్వం

### శంషాబాద్ డివిజన్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ వెంకటయ్య

**బుద్వేల్, జనవరి 24 (ప్రభాత ఉదయం)**

అటవీశాఖ కు చెందిన భూములను ఎట్టి పరిస్థితులలో కబ్జా కానివ్వం అని శంషాబాద్ డివిజన్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ వెంకటయ్య అన్నారు. శనివారం గగన్పహడ్ లోని శంషాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి. వీరేశం తో కలసి ఆయన వివరాలు వెల్లడించారు. కొత్వాల్ గూడ సమీపంలో శం షాబాద్ రెవెన్యూ సర్వే నెంబరు 626/2 లో అటవీ శాఖ కు 176.05 ఎకరాల డోమ్నేయిర్ రిజర్వ్ ఫారెస్ట్ ల్యాండ్ ఉందన్నారు. అందులో 166 ఎకరాల చుట్టు పెన్సింగ్ వేయడం జరిగిందన్నారు. మిగతా 9.5 ఎకరాలను పశువులను మేపుకోవడానికి అప్పట్లో వదలడం జరి గిందన్నారు. అలా వదిలిన 9.5 ఎకరాలను కొందరు ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేయాలని ప్రయత్నించి వలకలు వేయగా గతంలో కూల్చివేయడం జరిగిందన్నారు. తిరిగి రెండు రోజుల నుంచి ఆ స్థలంలో చదును చేస్తున్నారన్నారు. ఆటవీశాఖ భూమ లను చదును చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శంషాబాద్ ఏసీపీ కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

**తప్పుడు పత్రాలతో అటవీశాఖ భూములను కాజేయాలని చూస్తున్నారు :**

కొత్వాల్ గూడలోని 9.5 ఎకరాల డొమ్నేయిర్ రిజర్వ్ ఫారెస్ట్ భూములను తప్పుడు పత్రాలతో మహ్మద్ తజముల్ ఉద్దీన్ అలియాస్ మోయినుద్దీన్ ఖాన్, ఇతరులు ప్రయత్నాలు చేస్తున్నారని ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ వెంకటయ్య తెలిపారు. ఆ స్థలంలో మహ్మద్ తజముల్ ఉద్దీన్ ఉంటున్నారని శంషాబాద్ తహసీల్దార్ ఒక లేఖ ఇచ్చారని చెబుతున్నారని, తహసీల్దార్ ఇచ్చిన లెటర్ లో తేదీ గానీ, ఆర్సీ నెంబర్ గానీ లేదని గుర్తు చేశారు. కోర్టు నుంచి జడ్జిమెంట్ ఉందని తహసీల్దార్ రాసిన లేఖ లో ఉన్న హై కోర్టు 94/1991 సివిల్ సూట్ నెంబర్ 7 ఆఫ్ 1958 కూడా ఈ భూమి కి సంబందించినది కాదన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కబ్జాదారులపై, వారికి సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. అటవీశాఖ భూములను కాజేయాలనుకోవడం సరికాదన్నారు.



వాలీ బాల్ పోటీలకు ముస్తాబైన మైదానం

## నవ జ్యోతి యూత్ క్లబ్‌లో నేడు, రేపు కబడ్డీ, వాలీబాల్ పోటీలు

**బుద్వేల్, జనవరి 24 (ప్రభాత ఉదయం)**

గణతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 25, 26వ తేదీలలో రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగలారం శ్రీనివాస్, శ్యామల గంగాధర్ లు ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యార్థులకు కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. యువత కు వాలీబాల్ పోటీలను నిర్వహించడం జరుగుందన్నారు. గెలుపొందిన జట్టుకు నగదు పారితోషికాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, యువతీ యువకులు తమ పేర్లను నవజ్యోతి యూత్ క్లబ్ అవరణలో నమోదు చేసుకోవాలన్నారు.

## పిల్లర్ నెంబర్ 129 వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి

**బుద్వేల్, జనవరి 24 (ప్రభాత ఉదయం)**



రాజేంద్రనగర్ సర్కిల్ పీవీ నర్సింహ్మారావు ఎక్స్ ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 129 వద్ద గుర్తు తెలియని వ్యక్తి మరణించి పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలియరాలేదు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

## ఆరాంఘర్ వద్ద పెళ్లి బృందం మధ్య గొడవ

**బుద్వేల్, జనవరి 24 (ప్రభాత ఉదయం)**




బస్సులో వస్తున్న ఓ పెళ్లి బృందం లోని అమ్మాయి... అబ్బాయి తరపు వాళ్లు ఆరాంఘర్ పిల్లర్ నెంబర్ 298 వద్ద గొడవ పడిన సంఘటన ఇది. ఈ సంఘటన శనివారం తెల్లవారు జామున జరిగింది. ఓ వివాహానికి హాజరైన పెండ్లి కూతురు, పెండ్లి కుమారులకు సంబందించిన బందువులు బస్సులో తిరిగి వారి నివాసానికి వెళ్తున్న సమయంలో ఆరాంఘర్ వద్దకు రాగానే గొడవ కు దిగారు. ఆ గ గొడవ లో ఇరు గ్రూపులు కొట్టుకోవడంతో బస్సు అద్దం పగిలింది. బస్సులో ఉన్న వారు 100 కు ఫోన్ చేయగా అక్కడికి అత్తాపూర్ పోలీసులు చేరుకున్నారు. పోలీసులు రాగానే వారు ఒకరికొకడు సర్దిచెప్పుకుని మేమం తా ఒక్కటే అని చెప్పి అక్కడినుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు ను వివరణ కోరగా, వేరే ప్రాంతంలో పెళ్లికి హాజరై వస్తున్న సమయంలో పెండ్లి కుమారుడు, పెండ్లి కూతురు బందువుల మధ్య చిన్న పాటి గొడవ జరిగిందని, మేం వెళ్లగానే మళ్లీ సర్దుకుని ఒక్కటై వెళ్లిపోయారని, అంతకు మించి ఏమిలేదన్నారు.

## కిడ్నాప్ కేసులో ఒకరి రిమాండ్

**బుద్వేల్, జనవరి 24(ప్రభాత ఉదయం) :**



ప్రేమ్

కిడ్నాప్ కేసులో రాజేంద్రనగర్ పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఇన్స్ పెక్టర్ ముత్తుయాదవ్, ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ హనుమకొండ కు చెందిన ఖాజా అక్కడ వీర్ఆర్ఎగా పనిచేస్తూ సస్పెండ్ అయ్యాడు. నగరానికి వచ్చి బహదూర్ పురాలో నివాసం ఉంటున్నాడు. ఖమ్మంకు చెందిన ప్రేమ్ (29) కూకట్ పల్లి లో ఓ స్థలం సమస్య ఉండటంతో పని పూర్తిచేసుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. అయితే ఈ పని ఖాజాతో అవుతోందని ఓ వ్యక్తి ప్రేమ్ కు ఖాజాను పరిచయం చేశాడు. పనిచేయడానికి రూ.50 లక్షల ఖర్చు అవుతోందని ఖాజా నుంచి పలుదఫాలుగా డబ్బులు తీసుకున్నాడు. కాని పనిమాత్రం చేయడంలేదు. ఈ నెల 12 న ఖాజాను ఆరాంఘర్ లో కలిసిన ప్రేమ్ అతన్ని కారులో ఖమ్మం తీసుకెళ్లాడు. అక్కడికెళ్లిన తరువాత ఓ గదిలో ఖాజా ను బందించాడు. ఈ నెల 22వ తేదీన ఖాజా తన స్నేహితుడికి ఫోన్ చేసి చెప్పడంతో అతడు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫోన్ లొకేషన్ గుర్తించిన పోలీసులు 23వ తేదీ ఖమ్మం వెళ్లి ఖాజాను విడిపించుకొని తీసుకొచ్చారు. ప్రేమ్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అతడికి సహకరించిన మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

# నేడు గగన్ పహాడ్ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, జనవరి 24(ప్రభాత ఉదయం)**



గగన్పహాడ్ సెక్షన్‌లోని 33/11 కేవీ సబ్-స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఈ క్రింది ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి. హర్ష వర్ధన్ తెలిపారు. గగన్ పహాడ్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 15:00 గంటల వరకుగ్రీన్ సిటీ, జల్‌పల్లి, శివాజీ నగర్, జై భవాని విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 15:00 గంటల వరకుజై భవాని, ఇండస్ట్రియల్, మెట్రో మాల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 15:00 గంటల వరకు మెట్రో మాల్ గగన్‌పహాడ్ గ్రామం, ఎస్సీ కాలనీ, కయ్యూమ్ వెంచర్, కరాచీ బేకరీ, గోశాల,పిలికాన్ రబ్బర్ ఫీడర్,ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 15:00 గంటల వరకు పుకట్ నగర్, పారిశ్రామిక ప్రాంతం,ఆర్ఈసీ ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 15:00 గంటల వరకు ఆర్ఈసీ, బుడ్‌వెల్ రైల్వే స్టేషన్, పరివార్ దాబా, ప్రెస్టీజ్, డైమండ్ కాంటా , ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 15:00 గంటల వరకు శాతంరాయి గ్రామం ఫీడర్, శాతంరాయి గ్రామం, బలహీన వర్గాల కాలనీ, పసబండ ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 15:00 గంటల వరకు సాయంత్రం 15:00 గంటల వరకు శాతంరాయి ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో శాతంరాయి ఇండస్ట్రియల్ ,గోల్డ్ డ్రాప్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 15:00 గంటల వరకు సాయి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, బలహీన వర్గాల కాలనీ, బాసి రెడ్డి కాలనీ ,మీనాక్షి ఫీడర్ ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 15:00 గంటల వరకు మీనాక్షి పేపర్ ఇండస్ట్రీ, శాతంరాయి మెయిన్ రోడ్ గ్రామం, ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 15:00 గంటల వరకు మీనా కెమికల్ ఫీడర్ పరిధిలో పారిశ్రామిక ప్రాంతం, పుకట్ నగర్,త్రిశాల ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 15:00 గంటల వరకు అపర్ణ కన్‌స్ట్రక్షన్, సుమధుర, త్రిశాల అపార్ట్‌మెంట్, విల్లాల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

# రోడ్డు నియమాలను పాటిస్తూ వాహనాలు నడపాలి

## ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) జనవరి 24 ( ప్రభాత ఉదయం)




ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ వాహనాలను నడపాలని ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజ్ అన్నారు. శనివారం అల్వాల్ లోని బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ట్రాఫిక్ పోలీసులు, అల్వాల్ పోలీసుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయానికి వచ్చిన భక్తులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటిస్తూ నడపాలని అన్నారు. వాహనదారులు బాధ్యతాయుతంగా రోడ్డు భద్రతా నియమాలను పాటించి తమ ప్రాణాలను రక్షించుకోవాలన్నారు. ఈ వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. విధిగా హెల్మెట్ ధరించడం అలవర్చుకోవాలని వాహనదారులకు సూచించారు. మైనర్ లకు వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. ప్రజల భద్రత కోసమే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ సీఐ ప్రశాంత్, ట్రాఫిక్ సీఐ శంకరయ్య, ఎస్ఐ లు రాఘవేందర్ రెడ్డి, దేవేందర్, నవీన్ రెడ్డి, రాజశేఖర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గీతాంజలి రోబోటిక్ పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

పటాన్ చెరు, జనవరి 23 (ప్రభాత ఉదయం)



చదువుల తల్లి సరస్వతి దేవి ఆశీర్వాదం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించే వసంత పంచమిని పురస్కరించుకుని ఇస్నాపూర్ గీతాంజలి రోబోటిక్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, పలువురు చిన్నారులతో విద్యార్థుల తల్లిదండ్రుల సమేతంగా తొలి అక్షరాలు దిద్దిస్తూ మంత్రోచ్చారణల మధ్య అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల నిర్వాహకులు, సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీ దేవి అనుగ్రహం అందరిపైనా ఉండాలని, విద్యార్థులు భవిష్యత్తులో ఎన్నో అద్భుతాలు సాధించాలని పూజాదికాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు కృష్ణ కిషోర్, ప్రిన్సిపల్ గౌరి రేగొండ, ప్రియదర్శిని, దివ్య, శిరీష, నాగరాణి, కల్పన, ఐ.మాధవి, లక్ష్మి ,జి మాధవి, కృష్ణవేణి, సునీత, సహాయకులు ప్రభాకర్, స్వప్న, దుర్గా, లక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## ర్యాలంపాడు పునరావాస కేంద్రంలోనీ సమస్యలను పరిష్కారించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి,జనవరి24(ప్రభాత ఉదయం)

ధరూర్ మండలం ర్యాలంపాడ్ రిజర్వాయర్ పునరావాస కేంద్రంలోనీ సమస్యలు పరిష్కరించి మౌలిక వసతులు సౌకర్యాలు కల్పించాలని కోరుతు ధరూర్ మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ర్యాలంపాడ్ గ్రామ సర్పంచ్ వెంకట్రామ్ రెడ్డి,ఉప సర్పంచ్ గోవిందు, నిర్వాసితులు శనివారం జిల్లా కలెక్టర్ సంతోష్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, నర్సింగ రావు, ఆర్డీఓ అలివేలుకు వేరు వేరు గా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రం లో ఉన్న సమస్యలు పరిష్కరించి గ్రామం లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులతో చర్చించారు.ఈ కార్యక్రమం లో చింతలకుంట సర్పంచ్ రాజశేఖర్, బాలు, అధికారులు గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

# ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం




విద్యార్థులకు ఓటు హక్కుపై వివరిస్తున్న ముఖ్య అతిథి...



సమావేశానికి హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు.

శేరిలింగంపల్లి : జనవరి 24, (ప్రభాత ఉదయం)

శేరిలింగంపల్లిలోని (బెల్ ) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు జాతీయ ఓటర్ల దినోత్సవం పురష్కరించుకు అవగాహన కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత అధ్యక్షత వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పూలపల్లి వెంకటరమణ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఎన్నికలను సజావుగా నిష్పక్షపాతముగా నిర్వహించేందుకు రాజ్యాంగం ద్వారా ఏర్పాటు చేసిన సంస్థ అన్నారు. 1950 జనవరి 25న ఏర్పాటు చేయబడిన ఈ కమీషను సుప్రీంకోర్టు వలె రాజ్యాంగం ఏర్పరచిన స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థని చెప్పారు. దేశంలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, లోక్ సభ, రాజ్యసభ, రాష్ట్రాల శాసనసభలు, శాసనమండళ్ళకు జరిగే ఎన్నికలను కమీషన్ నిర్వహిస్తుందన్నారు. ఎన్నికల నిర్వహణ పర్యవేక్షణ, మార్గనిర్దేశకత్వం, నియంత్రణ చేయవలసిన బాధ్యతలను రాజ్యాంగం కమీషనుపై ఉంచింది. ఎన్నికల కమీషను అధినేతను ప్రధాన ఎన్నికల కమీషనరు అంటారు. తొలినాళ్ళలో ఒక కమీషనరు ఉండే వారు. 1993 అక్టోబరు 1వ తేదీ నుండి మరొక యిద్దరిని ఎన్నికల కమీషనర్లుగా నియమించారు. ఈ ముగ్గురు సభ్యులు కమీషను బాధ్యతలు నిర్వహిస్తూ ఉంటారు. ప్రధాన ఎన్నికల కమీషనర్లను రాష్ట్రపతి నియమిస్తారు. వీరి పదవీకాలం ఆరు సంవత్సరములు లేదా సదరు అధికార్లకు 65 సంవత్సరముల వయసు వచ్చే వరకు వర్తిస్తుంది. ఈ ముగ్గురు కమీషనర్లతో పాటు ఢిల్లీ లోని కమీషను కార్యాలయంలో కొంతమంది డిప్యూటీ కమీషనర్లు, 300 మంది అధికారులు యితర సిబ్బంది ఉంటారు. రాష్ట్ర ఎన్నికల కమీషను రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాటు చేయబడ్డాయి. జాతీయ ఎన్నికల కమీషనుకు ఉన్న అన్ని అధికారాలు రాష్ట్ర ఎన్నికల కమీషనుకు కూడా ఉంటాయి. ఎన్నికల సమయంలో మాత్రము ఎన్నికల నిర్వహణలో పాల్గొనే 50 లక్షలకు పైచిలుకు సిబ్బంది తాత్కాలికంగా ఎన్నికలు ముగిసే వరకు కమీషను అదుపాజ్ఞలలో పనిచేస్తారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అభిజిత్, అధ్యాపకులు డాక్టర్ అనురాధ, ప్రజ్వల, జనార్దన్ తోపాటు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు



## పార్కు స్థలం కబ్జాపై పిర్యాదు.. పరిరక్షించిన అధికారులు

పటాన్ చెరు, జనవరి 24 (ప్రభాత ఉదయం)

డివిజన్ పరిధిలోని పారిశ్రామిక అవసరాలకు కేటాయించిన పార్క్ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత జిహెచ్ఎంసి అధికారులపై ఉందని స్థానిక సీనియర్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి అన్నారు. బొల్లారం డివిజన్ సర్వేనెంబర్ 84 లోని పార్కు స్థలంలో అక్రమంగా రోడ్డు నిర్మించారని గుండ్ల మహేందర్ రెడ్డి చేసిన ఫిర్యాదు చేసిన నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పార్కు స్థలం పరిశీలించారు. అమీన్ పూర్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు అక్రమంగా నిర్మించిన రోడ్డును జెసిబి సహాయంతో గుంత తవ్వి చర్యలు చేపట్టారు. ఖాళీగా ఉన్న పార్క్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని వాటిని కట్టుదిట్టమైన చర్యలతో రక్షించి భావితరాలకు ఉపయోగపడే విధంగా సంరక్షించాలని మహేందర్ రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది దినేష్, రవి ,తదితరులు పాల్గొన్నారు.




## నేడు బాలాజీ నగర్‌లో
# ఉచిత వైద్య శిబిరం

### గుండ్ల సుజాతా మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలకు ఏర్పాట్లు

పటాన్ చెరు, జనవరి 24 (ప్రభాత ఉదయం)

అనారోగ్యం కారణంగా ఇబ్బందులు పడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు బొల్లారం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గుండ్ల సుజాతా మహేందర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బొల్లారం డివిజన్ ప్రాంత నివాసితుల కోసం శుభకర హాస్పిటల్ సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు. బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ గణేషుడి మండపం వద్ద ఈరోజు (ఆదివారం) ఉదయం తొమ్మిది గంటల నుంచి పద గంటల వరకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించటం జరుగుతుందని చెప్పారు.వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్ , డయాబెటాలజిస్ట్ డా రమేష్(ఎండి) ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉచిత ఆరోగ్య పరీక్షలు ( బీపీ, షుగర్, థైరాయిడ్ టిఎస్ హెచ్, బిజెపి పరీక్షలు చేయడం జరుగుతుందని,కాబట్టి అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని,

ఇతర వివరాల కోసం 9948579515, 9347563366 ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.



## బొల్లారం సఫాయి కార్మికుల వేతనాల కోసం పట్టణ బిజెపి అధ్యక్షుడు కేజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి చొరవ

పటాన్ చెరు, జనవరి 24 (ప్రభాత ఉదయం) :


బొల్లారం 272 డివిజన్ పరిధిలో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు గత మూడు నెలల వేతనాల సమస్య పరిష్కారమైందని బొల్లారం డివిజన్ బిజెపి అధ్యక్షుడు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. గత కొంతకాలంగా జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కార్మికులు తమ బాధను ఆనంద్ కృష్ణారెడ్డికి చెప్పారు. దీంతో కార్మికుల కష్టాలను తెలుసుకున్న ఆనంద్ కృష్ణారెడ్డి వెంటనే బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్సీ సంబంధిత డిసి కమిషనర్‌తో మాట్లాడి వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. నాయకుల కృషితో జీతాలు మంజూరు కావడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా: స్వర్ణ రాజు శివమణి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( కాప్రా డివిజన్ ) జనవరి 24 ( ప్రభాత ఉదయం )**



కాప్రా డివిజన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ స్వర్ణ రాజు శివమణి అన్నారు. శనివారం కాప్రా డివిజన్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఎల్లారెడ్డి గూడాలోని కృష్ణ నగర్ కాలనీలో రూ. 45 లక్షల తో నూతన సీసీ రోడ్లు, సాయిరాం నగర్ కాలనీలో రూ. 23 లక్షల వ్యయంతో రెండు నూతన పవర్ బోర్ డ్రిల్లింగ్ పనులకు స్థానిక కార్పొరేటర్ స్వర్ణ రాజు శివమణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాప్రా డివిజన్లోని ఎల్లారెడ్డిగూడ కృష్ణ నగర్లో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రధానదారుల సిసి రోడ్ నిర్మాణ పనులను పూర్తిచేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించామన్నారు. అనంతరం సాయిరాం నగర్ కాలనీలో రూ.23 లక్షల వ్యయంతో రెండు నూతన పవర్ బోర్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభించామన్నారు. కృష్ణ నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఏర్పాటుచేసిన అభినందన సమావేశంలో ప్రసంగిస్తూ కాలనీ ఏర్పడినప్పుడు నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, త్రాగు నీరు, కాలనీ ప్రధాన రహదారి నిర్మాణం, పార్కుల అభివృద్ధి పనులు చేపట్టానని చెప్పారు. డివిజన్ అభివృద్ధికి తాను సాయశక్తుల కృషి చేస్తున్నానని, డివిజన్లో ప్రతి కాలనీలో ప్రతిరోజు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పాలనలో డివిజన్ అభివృద్ధికి నిధులు సమృద్ధిగా అందిస్తున్నారని అన్నారు. అతీ త్వరలో కాలనీ అసోసియేషన్ ఆఫీస్ వెనుక పార్క్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి ఓపెన్ జిమ్, పచ్చని మొక్కలతో ఆధునిక హంగులతో ఆహ్లాదకరమైన పార్క్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చామన్నారు. అనంతరం సాయిరాం నగర్ కాలనీలో రూ.23 లక్షల వ్యయంతో రెండు నూతన పవర్ బోర్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభించామన్నారు. దీంతో సాయిరాం నగర్, సాయి నగర్, డబల్ బెడ్ రూమ్స్ కాలనీలకు నీటి కష్టాలు తీరుతాయని అన్నారు. పేద ప్రజలు అధికంగా నివసించే సాయిరామ్ నగర్, సాయి బాబా, సాయినగర్, ఇందిరానగర్లలో భూగర్భ డ్రైనేజి, త్రాగునీరు, రోడ్ల నిర్మాణం, పవర్ బోర్లు ఏర్పాటు, విధ్యుత్ దీపాల ఏర్పాటు చేయిస్తున్నామని అన్నారు. ఒక్క ఎకరాలో ఉన్న స్మశానవాటికకు 5ఎకరాల స్థలం కేటాయించి మొత్తం 6 ఎకరాల్లో హిందూ, ముస్లిం, క్రైస్తవులకు రెండేసి ఎకరాల స్మశానవాటికలు నిర్మించడం, రజకులకు 20 గుంటల ధోబి ఘాట్ స్థలం కేటాయించడం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కొబ్బనూరి నాగశేషు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, డైరెక్టర్ పూర్ణ యాదవ్, డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, జి సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, ఆదెపు శ్రీనివాస్, షాబుద్దీన్, మురళి, తోటకూర శ్రీకాంత్, శ్రీకాంత్ గౌడ్, కే రాజు, రిజ్వాన్ ఖాన్, జగదీష్ గౌడ్, టిల్లు యాదవ్, సంతోష్ చారి, సత్తిరెడ్డి, జగదీష్ రెడ్డి, సోంనాథ్, కృష్ణా నగర్ కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, కార్యదర్శి జైకుమార్, కోశాధికారి చిన్న, ప్రతినిధులు బి శ్రీనివాస్, బోగాడి శ్రీనివాస్, అప్పిరెడ్డి, స్నేహలత, లావణ్య, సభ్యులు కాలనీ వాసులు, సాయిరామ్ నగర్ డబల్ బెడ్ రూమ్స్ కాలనీల రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు వెంకటేష్, భార్గవి, మాస్, మహేష్, షఫీ, మున్నా, ప్రకాష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చింత రేవుల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

**కన్నుల పండుగగా రథోత్సవం**

**గద్వాల ప్రతినిధి, జనవరి24 (ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారి రథోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి రథోత్సవం శుక్రవారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున ఒంటి గంట వరకు కొనసాగింది. రథోత్సవానికి వచ్చే భక్తులతో పాటు బ్రహ్మోత్సవాల్లో స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం జనసంద్రంగా మారింది. ఇసుకేస్తే రాలనంత భక్తజన సందోహం మధ్య స్వామివారి రథోత్సవం కన్నుల పండుగగా జరిగింది. స్వామివారి రథోత్సవంలో భాగంగా ముందుగా స్వామివారిని ప్రధాన ఆలయం నుండి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈసందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రథోత్సవంపై స్వామివారి రాగానే ప్రధాన అర్చకులు రథానికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా స్వామివారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ధరూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## విద్యార్థులకు రోడ్డు భద్రతపైన అవగాహన

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 24(ప్రభాత ఉదయం)**




జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా శనివారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో తరిగొప్పుల మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో విద్యార్థిని విద్యార్థులకు రోడ్డు భద్రత పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ఏఎంవిఐ శ్వేత పిల్లల తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు, విద్యార్థులు తీసుకోవలసిన రోడ్డు భద్రత జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, పాఠశాల ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేవరుప్పులలో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసిన పోలీసులు

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 24(ప్రభాత ఉదయం)**



జిల్లా లోని దేవరుప్పుల మండలకేంద్రంలోని దాదాసాహెబ్ కాలనీ పరిధిలో ఉన్న వాగు నుండి శనివారం అక్రమంగారెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా, రెండు ట్రాక్టర్లను పట్టుకొని ట్రాక్టర్ యాజమాన్యం పైన కేసు నమోదు చేసిట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఎస్సై ఊర సృజన్ కుమార్ మీడియా కు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమతులు లేకుండా వాగు నుండి ఇసుకను టాక్టర్లలో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి**

**టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్**

**కూకట్ పల్లి, జనవరి 24 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం మూసాపేటలోని పార్టీ కార్యాలయం శ్రీ హేమ దుర్గా భవన్ లో టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలను, దృష్టిలో పెట్టుకొని కార్యకర్తలను, నాయకులను, కార్యోన్ముఖులను చేసేందుకు ఈ సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు పూర్తిస్థానాలు గెలిచేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై వారి నుండి సలహాలు సూచనలు సేకరించారు. బూత్ లెవెల్ కమిటీలను నియమించేందుకు త్వరలో డివిజన్ స్థాయి నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా రమేష్ పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళేలా చర్యలు తీసుకోవడం, అర్హులైన లబ్ధిదారులందరికీ వాటి ఫలాలు అందేలా చూడటం కార్యకర్తల బాధ్యత అని రమేష్ ప్రకటించారు. ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని ప్రత్యర్థి పార్టీల వ్యూహాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, సేవ్ దళ్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌కు చెందిన రోహింగ్యాలను దేశం నుండి తిరిగి పంపే వరకు నిరంతర పోరాటం చేస్తాం

**భాగ్యనగరాన్ని అసాంఘిక శక్తుల నుండి కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు**

**కూకట్ పల్లి, జనవరి 24 (ప్రభాత ఉదయం)**



"జాగో భాగ్యనగర్ ఉ చలో బాలాపూర్" అనే నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నిజాంబాద్ జిల్లా ఇంచార్జ్ మాధవరం కాంతారావు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి భూమండల జీవన్, మోహిత్ తో కలిసి జెండా ఊపి బాలాపూర్‌కు బయలుదేరిన బస్సులను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ దేశ భద్రత, రాష్ట్ర శాంతి, హిందూ ధర్మ రక్షణకు ముప్పుగా మారుతున్న అక్రమ చొరబాట్లపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భాగ్యనగరాన్ని అసాంఘిక శక్తుల నుండి రక్షించుకోవాలంటే ఇలాంటి ఉద్యమాలు అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన రోహింగ్యా చొరబాటుదారులను దేశం నుంచి పూర్తిగా తిరిగి పంపే వరకు నిరంతరంగా పోరాడి భాగ్యనగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వయంగా బస్సులో ప్రయాణిస్తూ బాలాపూర్‌లో నిర్వహించనున్న ధర్మ రక్షణ సభకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తూము శైలేష్ కుమార్, చంద్రశేఖర్ గుప్తా, పిట్ల మనోహర్, కార్యకర్తలు, హిందూ సంఘాల ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారు.



## ఘనంగా శ్రీ మాత యోగ అన్నపూర్ణేశ్వరి దేవి 26వ వార్షిక మహోత్సవం

**ప్రత్యేక పూజలు నిర్వహించిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు**

**కూకట్ పల్లి, జనవరి 24 (ప్రభాత ఉదయం)**

శ్రీ మాతా యోగా అన్నపూర్ణేశ్వరి దేవి షష్ఠి వింశతి (26వ) వార్షిక మహోత్సవం గాజులరామావరం, మహాదేవపురంలోని శ్రీ మాతా యోగా అన్నపూర్ణేశ్వరి దేవి వార్షిక మహోత్సవము సందర్భంగా శ్రీ యోగాచార్య పూజ్యశ్రీ జగన్ గురూజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షులు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్, కుకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి దేవి ఆశిస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి రావు, గొట్టిముక్కల జశ్వంత రావు, మోలుగు బీంరావ్, మేకల సుదర్శన్, నళిని కాంత్, శివ చౌదరి, పిడికిటి గోపాల్ చౌదరి, స్థానికులు భక్తులు పాల్గొన్నారు.



## బంగారు నంది అవార్డు అందుకున్న ప్రముఖ గాయకులు బాసారం భీమ్ రావు

**బాసారం భీమ్ రావు గానం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది**

**సంగీత రంగంలో భీమ్ రావు చేసిన సేవలు మరువలేనివి**

**చింతకుంట రామ్ మాణిక్యరావు**

**కూకట్ పల్లి, జనవరి 24 (ప్రభాత ఉదయం)**

సంగీతం రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న కూకట్ పల్లికి చెందిన ప్రముఖ గాయకుడు బాసారం భీమ్ రావు ప్రతిష్టాత్మకమైన బంగారు నంది అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కళా రంగాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రొఫెషనల్ సింగర్, మెలోడి క్వీన్ ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ యన్.ఇందిర ఆధ్వర్యంలో శోభన్ బాబు టాలెంటెడ్ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించగా, చింతకుంట రామ్ మాణిక్యరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రతిభావంతులైన కళాకారులను సత్కరించారు. ప్రముఖ గాయకుడు బాసారం భీమ్ రావుకి బంగారు నంది అవార్డుఉ2026ను ప్రదానం చేసి సత్కరించారు. హిమాయత్‌నగర్‌లోని అలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియం వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో సంగీత రంగంలో భీమ్ రావు చేసిన విశిష్ట సేవలను గుర్తించి అవార్డు అందజేశారు. వారి గానం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని అనేక వేదికలపై ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శోభన్ బాబు పేరుతో ప్రతిభావంతులను సత్కరించడం గర్వకారణమని తెలిపారు. కళాకారులకు ఇటువంటి గుర్తింపులు మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ చంద్రమౌళి, అనురాధా దేవి, నేరెళ్ల మాల్యాద్రి, అంజని కుమారి, యామిని, శంకర్ నారాయణ, అల్లూరి విల్సన్ పలువురు ప్రముఖ కళాకారులు, సంగీత ప్రేమికులు, సాహితీవేత్తలు ముఖ్య అతిథులుగా హాజరై భీమ్ రావుని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



## మీర్ పేట్‌లో ఘనంగా వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( మీర్పేట్ హెచ్ బి కాలనీ ) జనవరి 24 ( ప్రభాత ఉదయం)**

మీర్పేట్ హెచ్.బి కాలనీ డివిజన్ పరిధి మంగాపురం కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలలో భాగంగా వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే రాగిడి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాసులను శాలువాతో సత్కరించి దైవాశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, అశోక్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బోదాసు రవి, చారి, బాలయ్య గౌడ్, పూస రమేష్, దేవేందర్ కుమార్, మురళీ, బోజ నారాయణ, సాయి కుమార్, నవీన్, హరినాథ్ రెడ్డి, శేఖర్ గౌడ్, దండెం నరేందర్, నిసార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ కుటుంబానికి ఆడపిల్ల ఒక గిఫ్ట్ లాంటిది

## బాలికల హక్కులను పరిరక్షించాలి

## ఉజ్వలతో బాలికల అభ్యున్నతికి కృషి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 24(ప్రభాత ఉదయం) :**

ఆడపిల్ల ఉన్న ప్రతీ ఇల్లు ఎప్పుడు సంతోషకరం గా ఉంటుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు, దివ్యాంగులు , వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోశనివారం కలెక్టరెట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, డీసీపీ రాజా మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ. బాలికల పట్ల వివక్షతను ప్రదర్శించకుండా వారి అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై క్రమం తప్పకుండ వివిధ శాఖల అధికారులను సమన్వయము చేస్తు.. ఉజ్వల అనే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.ఆడపిల్ల లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే ఉజ్వల ప్రధాన లక్ష్యమన్నారు.ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉజ్వల కమిటీలను ఏర్పాటు చేసి బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు.అలాగే "బేటీ బచావో ఉ డిజిటల్ హటావో" అనే సందేశంతో బాలికలను డిజిటల్ దుర్వినియోగం నుండి రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రతి బాలికకు విద్య అందించినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమని కలెక్టర్ పేర్కొన్నారు.సమాజం లో మహిళల కు, ఆడపిల్ల లకి గొప్ప హోదా ఉండాలన్నారు.మన జిల్లా లో అమ్మాయిలకె చదువు మీద ఎక్కువ ఆసక్తి ఉందని... ఇలాగే తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు.ఒక్క చదువులోనే కాక... క్రీడల్లో, ఎన్సీసీ, సాంస్కృతిక కార్యక్రమాలలో ఆడపిల్లలు భాగస్వామ్యం అయ్యేల తల్లిదండ్రులు, ఉపాధ్యయులు దోహద పడాలన్నారు.వారికి సరైన నైపుణ్యాలను అందిస్తే.. ఆకాశమే హద్దు గా వారి భవిష్యత్ సాగుతుందన్నారు.సమాజంలో మహిళలు, ఆడపిల్ల ల మీద ఉండే సాంఘిక వివక్ష ను అరికట్టి... వారిప్రాధాన్యత గురించి అవగాహన పెంచడానికి అందరూ కృషి చేయాలన్నారు.డీసీపీ రాజా మహేంద్ర నాయక్ మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలు, పిల్లలు ఎదుర్కొనే సమస్యలను ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసే సౌకర్యాన్ని తెలంగాణ పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జాతీయ బాలిక దినోత్సవం ఉ 2026 సందర్భంగా ఈ కార్యక్రమంలో భాగంగా "మిస్ జనగామ ఉ 2026" పేరుతో బాలికలకు మూడు దశలలో పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు.ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమం సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లాలో ఉజ్వల పథకం ప్రారంభం కావడం శుభప్రదమని, ఇది బాలికల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని వక్తలు కొనియాడారు.ఈ కార్యక్రమం లో డి సి ఓ కోదండరాములు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, జడ్పీ అదనపు సీఈఓ, జీసీడీఓ గౌసియా బేగం, సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య , సభ్యులు శ్రీలత, కవిత , డిహెచ్‌ఈడబ్ల్యూ సిబ్బంది, చైల్డ్ లైన్ సిబ్బంది, బాలికలు మరియు ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణలో శిక్షణ, సామర్థ్యాభివృద్ధి అంశంలో జనగామ జిల్లాకు మరో విశిష్ట అవార్డు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అవార్డుకు ఎంపిక

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 24(ప్రభాత ఉదయం)**



జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వేడుకల్లో జనగామ జిల్లా మరో విశిష్ట గౌరవాన్ని సాధించింది. ఎన్నికల నిర్వహణలో శిక్షణ, సామర్థ్యాభివృద్ధి అంశంలో చేసిన ఉత్తమ కృషికి గాను జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అవార్డుకు ఎంపిక అయ్యారు. జనవరి 25(ఆదివారం) న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఈ అవార్డును కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ స్వీకరించనున్నారు. కలెక్టర్ దిశా నిర్దేశం తో...ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు ముందస్తుగా, నిరంతరంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించడం, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఎన్నికల నిర్వహణను అధికారులు సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించారు.ఎన్నికల నిర్వహణ లో భాగస్వామ్యం అయిన ప్రతీ ఒక్క అధికారికి కలెక్టర్ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేసారు.సమిష్టి కృషి వల్లనే జిల్లా కి ఈ అవార్డు దక్కిందని తెలిపారు.ఈ అవార్డు ద్వారా జనగామ జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, సుశిక్షిత సిబ్బందితో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించగల సామర్థ్యం కలిగి ఉందని పలువురు అధికారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేసారు.

## పల్లా రాజేశ్వర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో ఖబర్దార్:

### కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 24(ప్రభాత ఉదయం) :**

జనగామ జిల్లా కేంద్రంలోనీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. నిన్న జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి సీతక్క ఆద్వర్యంలో ప్రారంభించారు.స్థానిక దొంగ ఓట్ల తో గెలిచిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి నిన్న జిల్లాలో జరిగిన అభివృద్ధి ప్రారంభోత్సవ కార్యక్రమంలో గొడవలు సృష్టించారని,ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యే పల్లా కార్యక్రమాలకు తాగి ఇష్టం వచ్చినట్లు బూతు మాటలు మాట్లాడుతూ ప్రవర్తించాడన్నారు .మా నాయకుల పట్ల పల్లా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు.స్థానికులకు స్థానికేతరులకు చాలా తేడా ఉంటుందని, నేను జనగామ బిడ్డను , పల్లా ఎక్కడి వాడో... చెప్పాలన్నారు.పల్లా అసలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకి, తెలంగాణ ఉద్యమంలో పల్లా ఎక్కడ ఉన్నాడో చెప్పాలన్నారు.దోచుకోవడానికి, దోపిడి చేయడానికి, దొంగ ఓట్ల సృష్టించిన వాడు పల్లా,దొంగ ఓట్ల తో గెలిచాడనీ నిరూపిస్తా, దీనికి పల్లా సిద్ధమా? నిరూపిస్తే పల్లా రాజీనామా చేస్తాడా? నేను నిరూపించ లేకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా దీనికి పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పందించాలని అన్నారు.పల్లా రాజేశ్వర్ రెడ్డి హాస్పిటల్ పేరుతో చేసే చికిత్స అంత దొంగ చికిత్స నే అని తన హాస్పిటల్ ఉన్నత స్థాయి పొందేందుకు చికిత్స పేరు తో మోసం చేస్తున్నాడని, హాస్పిటల్ పేరుతో చేసే చికిత్స లో ఇక్కడి ప్రాంత ఓ వ్యక్తి మరణించడన్నారు. జనగామ లో ఇంకో సారి గొడవలు చేయాలని చూస్తే తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఏఎంసి చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి, బ్లాక్, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






గులాబీ పూలు ఇచ్చిడ్రైవర్లకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆర్టీసీ డీఎం

## గద్వాల ఆర్టీసీ డిపోలో ఘనంగా డ్రైవర్స్ డై

**గద్వాల ప్రతినిధి, జనవరి24 (ప్రభాత ఉదయం)**

ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చి ఆర్టీసీ పట్ల నమ్మకం పెంచాలని గద్వాల ఆర్టీసి డిపో మేనేజర్ సునీత సూచించారు. డ్రైవర్లలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు 'డ్రైవర్స్ డే'ను గద్వాల ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ సునీత ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్వాల ఆర్టీసీ డిపో నుండి కృష్ణవేణి చౌరస్తా వరకు వాహన చోదకులకు డ్రైవర్లకు డ్రైవర్స్ డే శుభాకాంక్షలు తెలుపుతూ రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎం సునీత మాట్లాడుతూ... ఆర్టీసీ అభివృద్ధిలో, ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చడంలో డ్రైవర్స్ పాత్ర కీలకమన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డ్రైవర్లకు గులాబీ పుష్పమిచ్చి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.



## గద్వాల వ్యవసాయ మార్కెట్లో 9,389 రూపాయల ధర పలికిన వేరుశనగ

### వేరుశనగ రైతును సన్మానించిన మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు

**గద్వాల ప్రతినిధి, జనవరి24 (ప్రభాత ఉదయం)**

గద్వాల వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగకు శనివారం రికార్డుస్థాయిలో క్వింటా 9,389 రూపాయల ధర పలికింది. మార్కెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఇంతపెద్ద మొత్తంలో వేరుశనగకు ధరలు రాలేదు. దేవునిపల్లి గ్రామానికి సయ్యద్ ఎక్బాల్ అహ్మద్ అనే రైతు పండించిన వేరుశనగ పంటలు 54బస్తాలు గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకవచ్చి విక్రయించాడు. ఎస్అర్ వీటి ఖరీదు వ్యాపారస్తుడు రూ.9,389 మద్దతు ధర లభించింది. ఈ సందర్భంగా గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు, వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కార్యదర్శి నరసింహ్మా వేరుశనగా రైతును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్వాల మార్కెట్ యార్డుకు నాణ్యవంతమైన పల్లిని తీసుకొచ్చి అధిక ధర పొందాలని సూచించారు.



## సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.ప్రేమ్ గౌడ్

**రాజేంద్రనగర్,జనవరి23(ప్రభాత ఉదయం)**

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి.ప్రేమ్ గౌడ్ అన్నారు.శనివారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప,వాంబే కాలనీలో ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని, క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రాజీవ్ గృహకల్ప,వాంబే కాలనీలోఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో డ్రైనేజీ లైన్ మంజూరు చేయించడంతో పాటు పూర్తి చేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ మేరకు కాలనీవాసులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,నాయకులు ప్రేమ్ గౌడ్,లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.అనంతరం ప్రేమ్ గౌడ్ మాట్లాడుతూ...ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే,నిరంతరం అందుబాటులో ఉంటూ పరిష్కారం కోసం పని చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారులు వెనువెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు.ఎవరు ఎలాంటి ఇబ్బందులు పడినా తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యేకు వివరించి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సరికొండ వెంకటేష్,ఎన్ను శ్రీనివాస్ రెడ్డి,గట్టయ్య, ధనుంజయ,ఎల్లప్ప, మధుకర్, నారాయణ, నరేష్,రవి,పూర్ణచందర, బాలు,సనావుల్లా, యంజాల శేఖర్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీష్ రావు తనపై వచ్చిన ఆరోపణలపై ప్రజలకు సమాధానం చెప్పాలి

### తెలంగాణ బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుఱ్ఱంపల్లీ శామల్ రాజ్



రాజేంద్రనగర్,జనవరి24(ప్రభాత ఉదయం) ప్రశ్నిస్తే అక్రమ కేసులంటూ హరీష్ రావు బెంబేలెత్తడం ఏంటని తెలంగాణ బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుఱ్ఱంపల్లీ శామల్ రాజ్ అన్నారు.దర్యాప్తు బృందంచే విచారణ ఎదుర్కొంటున్న టి.హరీష్ రావు విషయంలో విచారాన్ని కలిగిస్తుందని వివరించారు.ఇపుడు హరీష్ రావుకు ఏమైందనీ,ఆయన మీద వచ్చిన అభియోగాల మీద విచారణ జరపడం తప్పా అని ఆయన సూటిగా ప్రశ్నించారు.ఆయన ఏం ప్రశ్నించాడని భూమి లేని పేదలకు భూమి కావాలనా సంపద ఆస్తులలో అసమానతలు వద్దు సమానత్వం కావాలనా ఏమని ప్రశ్నించాడని ఎద్దేవా చేశారు.మహనీయులు డాక్టర్ అంబేద్కర్ అన్ని అసమానతలు దోపిడీ మీద రాజీలేని పోరాటం చేసి కన్న బిడ్డలను పోగొట్టుకున్నాడని,అలాంటి మహనీయుని జయంతి ఉత్సవానికి నాయకత్వం దక్కించుకొని సంవత్సరమంతా పెట్టుబడిదారి వ్యాపార రాజకీయ పార్టీల కండువాలు మెడలో వేసుకొని ఏప్రిల్ 14 వచ్చిందంటే నీలిరంగు కండువా వేసుకొని అంబేద్కర్ కు దండ వేసి జై అంటూ ఆయన ఆశయాలు సాధిస్తామంటూ అరచి రాజకీయ నాయకుల గుర్తింపు పొంది,పేద ప్రజల మీద ఎదిగే ఇలాంటి గొప్పోళ్లకు చెంచాగిరి చేయడం రాజకీయం ప్రయోజనం పొందడానికే తప్ప మరేమీ కాదని మండిపడ్డారు.ఇదా అంబేద్కర్ ఆశయం,వాదమా అని ప్రశ్నించారు.ఓట్లేసి గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన హరీష్ రావు హైదరాబాద్ కొండాపూర్ లో ఉండడం ఏంటన్నారు.

## చంపాపేట్ బీజేపీ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి కన్నుమూత..

**హైదరాబాద్(చంపాపేట్) ,జనవరి24(ప్రభాత ఉదయం)**



తెలంగాణ బీజేపీలో తీవ్ర విషాదం నెలకొంది.ఆ పార్టీ సీనియర్ నేత,చంపాపేట్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి కన్నుమూశారు.గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆయన నానక్ రాంగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆరోగ్య విషమించడంతో శనివారం (జనవరి24) తుది శ్వాస విడిచారు.వంగ మధుసూదన్ రెడ్డి మృతికి పలువురు రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం భౌతికాయాలోని హైదరాబాద్ లోని ఆయన నివాసానికి తరలించారు.

## తెలంగాణ మూవీ,టీవీ,డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం: అధ్యక్షులు రాజశేఖర్

**హైదరాబాద్,జనవరి23(ప్రభాత ఉదయం)**

తెలంగాణా మూవి,టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ జనరల్ బాడీ సమస్యలను పరిష్కరించేలా ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని తెలంగాణా మూవి,టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షులు రాజశేఖర్ తెలిపారు.శనివారం తెలంగాణ మూవి,టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం(సర్వసభ్య సమావేశం) శనివారం మోతినగర్ కమ్యూనిటీ హాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరుకు జరుగుతుందని ఆయన సూచించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలు హాజరవుతున్నట్లు సూచించారు.అందుకు యూనియన్ కార్యవర్గ కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరు తమ విధిగా విచ్చేసి యూనియన్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన తెలిపారు.అంతేకాకుండా సమావేశంలో పలు అంశాలు చర్చిస్తామని అన్నారు.దీంతో సభ్యులందరూ తప్పనిసరిగా యూనియన్ సభ్యులను ప్రతి ఒక్కరిని పేరుపేరునా ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగిందని అధ్యక్షులు రాజశేఖర్,జనరల్ సెక్రెటరీ నూకరాజులు సూచించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608